ఇంటర్ ప్రవేశాలకు వేళాయె..

- హైస్కూల్ ప్లస్‌లలో వంద సీట్లు ఖాళీ
- గాజువాక, గంగవరం హైస్కూళ్లలో 25శాతం భర్తీ
- వచ్చే నెల 1 నుంచి తరగతులు ప్రారంభం



గాజువాక హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ విద్యార్థులకు డిజిటల్ బోర్డుపై బోధిస్తున్న అధ్యాపకుడు (ఫైల్)



ఇంటర్ విద్యార్థినులు (ఫైల్)

గాజువాక: జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్మీడియట్ కోర్సులకు 107 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి తరగతులను ప్రారంభించనున్న నేపథ్యంలో మొత్తం అడ్మిషన్లు పూర్తి చేయడానికి ఆయా పాఠశాలల్లోని ఇంటర్ అధ్యాపకులు ప్రచారం ముమ్మరం చేశారు. సుమారు ఐదు లక్షలమంది జనాభా ఉన్న గాజువాక ప్రాంతంలో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒక్కటే ఉండటం, దీంతో ఎక్కువమంది విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు కళాశాలలను ఆశ్రయించాల్సి రావడం తదితర కారణాలరీత్యా గాజువాకలో గాజువాక, గంగవరం జిల్లా పరిషత్ హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేసి బాలికల కోసం ఇంటర్మీడియట్ కోర్సులను రెండేళ్ల క్రితం ప్రారంభించిన విషయం తెలిసిందే. రెండు పాఠశాలల్లోను ఎంపీసీ, బైపీసీ కోర్సులను ప్రారంభించారు. ఒక్కో పాఠశాలకు 80 మంది చొప్పున మొత్తం 160 సీట్లతో హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్మీడియట్ తరగతులను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో ఒక్కో గ్రూప్‌కు 40 సీట్ల చొప్పున విద్యార్థులను చేర్చుకోవడానికి అవకాశం కల్పించారు. పదో తరగతి తరువాత ఆర్థికంగా ఇబ్బందులున్న వారు అటు అగనంపూడిలోని జూనియర్ కళాశాలకు గాని, నగరంలోని ప్రభుత్వ కాలేజీలకు గాని కష్టపడి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. అలా వెళ్లలేనివారు ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గాజువాక, గంగవరం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఇంటర్మీడియట్ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం 25 శాతం సీట్లు భర్తీ అయినట్టు సంబంధిత అధ్యాపకులు తెలిపారు.

అధ్యాపకుల ఇంటింటి ప్రచారం

గాజువాకలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లకు గాను ఎంపీసీలో పది మంది, బైపీసీలో 12 మంది అడ్మిషన్లు పొందినట్టు అధ్యాపకులు తెలిపారు. ఈ పాఠశాలలో ఇంకా 58 సీట్లు ఖాళీ ఉన్నాయి. గంగవరం హైస్కూల్ ప్లస్‌లో కూడా సంబంధిత కోర్సులలో అడ్మిషన్లకు ఖాళీలు ఉన్నట్టు అధ్యాపకులు తెలియజేశారు. ఇక్కడ 80 సీట్లకు గాను బైపీసీలో 22 మంది, ఎంపీసీలో తొమ్మిది మంది అడ్మిషన్లు పొందారు. మిగిలిన సీట్లను కూడా భర్తీ చేయడానికి అధ్యాపకులు ప్రచారం ముమ్మరం చేశారు. తాజాగా పదో తరగతి పాసైన విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి తమ పాఠశాలల్లో ఇంటర్‌లో చేరాలని ప్రోత్సహిస్తున్నారు.



గాజువాక హైస్కూల్‌లో ప్లస్ టు బ్లాక్

డిజిటల్ పద్ధతుల్లో బోధన

ఇంటర్మీడియట్ తరగతులను అధ్యాపకులు అధునాతన పద్ధతుల్లో బోధిస్తున్నారు. ప్రతీ తరగతిలో ఐఎఫ్‌పీ ప్యానెల్స్ (డిజిటల్ బోర్డులు) ఉపయోగిస్తున్నారు. అన్ని సబ్జెక్టులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించిన విషయం తెలిసిందే. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని అధ్యాపకులు కోరుతున్నారు.

వాంబే కాలనీలో కార్డన్ సెర్చ్

- 5 సెక్టార్లలో విస్తృత తనిఖీలు
- 674 నివాసాల పరిశీలన
- 26 బైక్‌లు స్వాధీనం



కాలనీలో అనుమానితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీస్ అధికారులు



వాంబే కాలనీలో పర్యటిస్తున్న డీసీపీ మేకా సత్తిబాబు, ఏసీపీ త్రినాథ్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక శివారు ప్రాంతం వాంబే కాలనీలో జోన్ – 2 డీసీపీ మేకా సత్తిబాబు, సౌత్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీ 5 సెక్టార్ల పరిధి 27 బ్లాక్‌లలోని 674 నివాసాల్లో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కాలనీ నుంచి ప్రతీ రోడ్డును బ్లాక్ చేసి గట్టి నిఘా పెట్టారు. సుమారు 42 మంది సిబ్బందితో ప్రతీ నివాసాన్ని, ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా

వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలను ప్రకటించనుండటంతో సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసులు గట్టి నిఘా పెట్టారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న రౌడీ షీటర్లు, పలు కేసుల్లో ఉన్న ముద్దాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి రికార్డులు, సరైన పత్రాలు లేని 26 బైక్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

ఎన్నికల కౌంటింగ్ జరగనున్న దృష్ట్యా వాంబే కాలనీ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది అనుమానితులు సంచరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అధికారులు తెలిపారు. గాజువాకకు శివారు ప్రాంతం కావడంతో ఈ కాలనీలో బయటి నుంచి వచ్చిన వారు అధికంగా ఉండటాన్ని గుర్తించామన్నారు. శివారు ప్రాంతం కావడంతో బయటి వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో రౌడీ షీటర్‌తో పాటు పలువురు పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న తేదీన లేదా ముందు డీజే సౌండ్లు వినియోగించడం, బాణసంచా కాల్చడం, ఇతర నిషేధిత వస్తువులను వినియోగించడం, అక్రమ మద్యం నిల్వలు, విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీసీపీ, ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో గాజువాక, దువ్వాడ, స్టీల్‌ప్లాంట్ సీఐలు, 5 గురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 పరిధిలో 33 కేవీ షీలానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా షీలానగర్, గవరజగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, హరిజన జగ్గయ్యపాలెం, పోర్టు రోడ్డు ఏరియా, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, విద్యుత్ వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

వైకుంఠ వేంకటేశ్వరుడికి పంచామృతాభిషేకం



స్వామిని పంచామృతాలతో అభిషేకిస్తున్న అర్చకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వర స్వామి వారికి బుధవారం పంచామృతాభిషేకాలు చేశారు. స్వామి వారి జన్మ తార శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకాలు చేశారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో సిరట్ల వాసు, సాలాపు రామారావు, కనక సూర్యారావు, శంకరరావు, పెంటకోట నాగేశ్వరరావు, అప్పలరెడ్డి, దేవి తదితరులున్నారు.

2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

ఉక్కునగరం: తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం, విశాఖపట్నం ఆధ్వర్యంలో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కుమారస్వామి, జి.ఆనంద్ తెలిపారు. తెలంగాణా ఏర్పాటై 10 ఏళ్ల పూర్తి కావస్తున్న సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వేడుకలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉక్కునగరం క్లబ్‌లో ఏర్పాటు చేస్తున్న వేడుకలకు తెలంగాణ ప్రాంత ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు.

నేత్రపర్వం.. నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం నేత్రపర్వంగా జరిపించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ట్రెండ్స్ ఇన్ ఎమర్జింగ్ నానో బయో టెక్నాలజీ-కరెంట్ అప్లికేషన్స్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్టస్' సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. జూలై 15వ తేదీన ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తారు. పోస్టర్ ఆవిష్కరణలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఎన్.ఎన్.కిషోర్‌బాబు, సదస్సు కన్వీనర్ ఆచార్య పి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో సీపీ ట్రాఫిక్ డ్రైవ్



పాతగాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్‌ను పరిశీలిస్తూ సూచనలిస్తున్న సీపీ రవిశంకర్

అక్కిరెడ్డిపాలెం: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ బుధవారం రాత్రి ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ స్టిచ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా షీలానగర్ నుంచి పాతగాజువాక వరకు ట్రాఫిక్ పరిస్థితిని సమీక్షించారు. ముందుగా షీలానగర్‌లోని సిగ్నల్ పాయింట్ వద్ద ఆగి ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను, ట్రాఫిక్‌ను పరిశీలించారు. అనంతరం పాత గాజువాక చేరుకుని ట్రాఫిక్ వ్యవస్థను పరిశీలించారు. పాత గాజువాక నుంచి షీలానగర్ వరకు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు సీపీకి వివరించారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో బోర్డులు, స్టిక్కర్లు, నివారణ చర్యలకు సంబంధించిన అన్ని రకాల వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసులు, ఏసీపీ రాజీవ్, గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి శాంతి కల్యాణం



శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి జన్మతార శ్రవణా నక్షత్రం సందర్భంగా శాంతి కల్యాణం జరిపించినట్లు దివ్యక్షేత్రం ఆస్థాన అర్చకులు తెలిపారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

చిత్రలేఖన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మురళీనగర్ బాలభాను విద్యాలయం ప్రాంగణంలో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 2న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు 'ప్రపంచ పర్యావరణం-పరిరక్షణ' అనే అంశంపై పోటీ జరుగుతుందన్నారు. 3–5 తరగతులు, 6–8 తరగతులను ప్రత్యేక విభాగాలుగా ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు డ్రాయింగ్ షీట్స్ ఇస్తామని, క్రేయాన్స్, కలర్స్‌లు వారే తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 94926 41242, 91210 07683 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యమే బీజేపీ అజెండా

అగనంపూడి: లాభాల బాటలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడం, తద్వారా వారికి అనుకూలంగా ఉన్న పెట్టుబడిదారుల చేతుల్లో తక్కువ ధరకు తాకట్టుపెట్టడం బీజేపీ ప్రభుత్వ అజెండాగా కొనసాగుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో 1203వ రోజు దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ చేతుల్లో తోలు బొమ్మలుగా మారిన బీజేపీ ప్రభుత్వ పెద్దలు ఒక రాష్ట్రానికి చెందిన బడాబాబులకు దేశంలోని జాతీయ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. మూడు సంవత్సరాలుగా ఉక్కు పరిరక్షణ కోసం చేస్తున్న దీక్షలను కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోయినా దేశ ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. రాష్ట్రానికి ఆయువు పట్టులాంటి విశాఖ ఉక్కు విషయంలో కేంద్రం తప్పిదాలను సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సన్యాసిరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ఆర్టీసీ డ్రైవర్‌కు సత్కారం

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపో డ్రైవర్ నీలం నరసింహారావును అనకాపల్లికి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు సత్కరించారు. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్ పైలాన్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించి, బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను విధులకు సకాలంలో, సురక్షితంగా చేర్చడంలో నరసింహారావు సహకారం మరువలేమన్నారు. సన్మాన గ్రహీత నరసింహారావు మాట్లాడుతూ తన విధి నిర్వహణలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు వి.కె.ఎం.నాయుడు, రాపేటి మహాలక్ష్మినాయుడు, కె.ఎస్.ఆర్.గుప్తా, జి.వెంకటరెడ్డి, విల్లూరి రామకృష్ణ, వి.ఎం.వి.వి.ఎల్.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ఆర్టీసీ డ్రైవర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఇంటర్ పరీక్షలకు 39 మంది గైర్హాజరు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 39 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణారావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 357 మంది హాజరు కావాల్సి ఉండగా 340 మంది హాజరయ్యారని, 17 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. వీరిలో ఫిజిక్స్ పరీక్షకు 9 మంది, ఎకనామిక్స్‌కు 8 మంది హాజరు కాలేదని ఆయన తెలిపారు. కాగా మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 495 మంది హాజరు కావాల్సి ఉండగా 473 మంది హాజరు కాగా 22 మంది హాజరు కాలేదన్నారు. వీరిలో ఫిజిక్స్‌కు 11 మంది, ఎకనమిక్స్‌కు 11 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

దువ్వాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

- మూడు మాసాలుగా స్పందనలో ఫిర్యాదులు లేకపోవడంపై ప్రశంసలు
- రికార్డుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్‌ను నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ మేకా సత్తిబాబు బుధవారం సందర్శించారు. ఈ స్టేషన్ పరిధిలో గత మూడు మాసాల్లో ఒక్క స్పందన ఫిర్యాదు లేకపోవడంపై ఇక్కడి అధికారులను ప్రశంసించారు. ముందుగా ఆయన స్టేషన్ ఆవరణను పరిశీలించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ కేసుల చార్జిషీట్లు పరిశీలించారు. తరువాత సిబ్బందితో మాట్లాడారు. సమస్యలు ఉంటే చెప్పాలని సిబ్బందిని కోరారు. తరువాత ఆయన మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా వారం వారం ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి ఈ స్టేషన్ పరిధి నుంచి ఫిర్యాదులు లేకపోవడంపై ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ సీఐ ఎర్రంనాయుడును, సిబ్బందిని ప్రశంసించారు. ఫిర్యాదుదారులకు న్యాయం జరిగిందని భావిస్తే పై అధికారులకు తదుపరి ఫిర్యాదులు ఉండవని, ఈ స్టేషన్ పరిధిలో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలుగుతుందని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీసులపై నమ్మకం కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బొమ్మల తయారీలో శిక్షణ

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



తాము తయారు చేసిన బొమ్మలతో చిన్నారులు

గాజువాక: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గాజువాక గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం బొమ్మల తయారీలో శిక్షణ ఇచ్చారు. నిరుపయోగమైన కొబ్బరి చిప్పలు, పేపర్లు, గులకరాళ్ల తదితర వస్తువులతో ఇల్లు, పూరిగుడిసె, పిచ్చుక గూడు, స్విమ్మింగ్ పూల్ వంటి బొమ్మలను తయారు చేయించారు. అంతకుముందు చిన్నారులకు కథలు చెప్పడం, దానిలోని నీతిని వివరించడం, వారితో కథలు చదివించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలతో ఖోఖో ఆడించారు. వేసవి విజ్ఞాన శిబిరం ఎంతో ఉత్సాహంగా సాగుతోందని గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయాధికారి పీవీ రమణ వారికి నీతి కథలను వివరించారు. చిన్నారులకు కథలు చెప్పి, వారి సందేహాలను నివృత్తి చేశారు.



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వాహనచోదకునికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన వాహనచోదకుడు

అక్కిరెడ్డిపాలెం: పాదచారుడిని ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి, వాహనచోదకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలివి.. అక్కిరెడ్డిపాలేనికి చెందిన నేలపాటి శ్యాంబాబు బుధవారం రాత్రి బీహెచ్ఈఎల్ సిగ్నల్ పాయింట్ నుంచి నాతయ్యపాలెం వైపు సర్వీసు రోడ్డులో నడిచి వెళ్తున్నారు. అదే సమయంలో ఏపీ 31 డీక్యూ 9301 నంబరు గల హోండా యాక్టీవాపై సుమారు 50 సంవత్సరాలు పైబడిన గుర్తు తెలియని వ్యక్తి పాదచారుడిని వాహనంతో వెనుక నుంచి ఢీ కొట్టారు. దీంతో వాహనంపై ఉన్న వ్యక్తి అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, 108కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయాలపాలైన వ్యక్తికి సంబంధించిన వివరాలేమీ లేకపోవడంతో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పాదచారుడికి చేతికి స్వల్పగాయాలయ్యాయని తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు, పందులు

జీవీఎంసీ కమిషనర్‌కు వుడా ఫేజ్–1 కాలనీవాసుల ఫిర్యాదు



రాజీవ్‌నగర్ వుడా ఫేజ్–1లో పందుల గుంపుల హల్‌చల్

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ వుడా ఫేజ్–1 కాలనీలో కుక్కలు, పందుల స్వైరవిహారంతో కాలనీవాసులు బెంబేలెత్తుతున్నారు. పందులు, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీవాసులు, అసోసియేషన్ ప్రతినిధులు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

వృద్ధుడు, బాలుడికి గాయాలు

వుడా ఫేజ్–1లో మూడు దశాబ్దాల నాటి డ్రైనేజీ వ్యవస్థ శిథిలస్థితికి చేరడంతో ఇళ్ల మధ్యనే మురుగునీటి నిల్వలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఓపక్క దోమలు, మరోపక్క పందుల గంపులు, కుక్కల దాడులతో కాలనీవాసులు బెంబేలెత్తుతున్నారు. పందులు పదుల సంఖ్యలో కాలనీలో కలియతిరుగుతూ స్థానికులను భయపెడుతున్నాయి. తరిమితే దాడి చేస్తున్నాయి. కుక్కలు కూడా కాలనీలో హల్‌చల్ చేస్తున్నాయని, వీటిని అదుపు చేయాలని కాలనీవాసుల సంతకాలతో అసోసియేషన్ బుధవారం జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం కుక్కల దాడిలో ఒక వృద్ధుడు, బాలుడు గాయపడ్డారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

భానుడి భగభగ



తిక్కవానిపాలెం తీరంలో సేద తీరుతున్న ప్రజలు

పరవాడ: ఎండలు మండుతున్నాయి. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో ఉదయం 9 గంటలు దాటితే బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. రోహిణి కార్తె ప్రవేశంతో ఎండలు మరింతగా ముదరడంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక చిన్నా పెద్ద తేడా లేకుండా ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలకు చేరుకొని జలకాలాటలతో వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. దీంతో రహదారుల వెంబడి ఏర్పాటు చేసిన దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.